అంబలి పంపిణీ

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి అంబలి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియ, సభ్యులు శంకర్, భీంరావు, నాయకులు చరణ్, బస్వస్, జమీర్, సాయి, ప్రమోద్, ఫురఖాన్, అకిబ్ పాల్గొన్నారు.

పశ్చిమబెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో హిందువులు, హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నందున అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, గోరక్షక్ ఆధ్వర్యంలో శనివారం అదనపు కలెక్టర్ డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జాగో హిందూ కమిటీ జిల్లా అధ్యక్షుడు సంతోష్, భజరంగ్ దళ్ పట్టణాధ్యక్షుడు శ్రావణ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు నవీన్, విపిన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

సిర్పూర్(యు), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాహాపూర్ గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారిన ఇద్దరు పిల్లలకు హెడ్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీకాంత్ శనివారం ఐదు వేల రూపాయలు అందజేశారు. పిల్లల చదువు కోసం బాధ్యత తీసుకుంటామన్నారు. జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిల్లలను పరామర్శించారు. కార్యక్రమంలో జాదవ్ ఊష, తోడ్సం రమేష్, కోవ నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

సిర్పూర్(యు), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీలో శనివారం ఆడపిల్లలకు ఐసీఐ మోటివేషనల్ స్పీకర్ చెంచు లక్ష్మి గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే షీ టీంకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జయశ్రీ, సౌందర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

- జిల్లాలో తగ్గుతున్న కూరగాయల సాగు
- ఇతర ప్రాంతాల నుంచి సరఫరా
- రెండు నెలలుగా పడిపోతున్న భూగర్భ జలాలు
- రైతులకు అధికారుల ప్రోత్సాహం కరువు

ఏటా వేసవిలో కూరగాయల ధరలు పెరిగి వినియోగదారుల్లో ఆందోళన మొదలవుతుంది. వేసవిలో కూరగాయల సాగు తగ్గుతోంది. అధికారులు ముందస్తు ప్రణాళికతో ప్రోత్సహించకపోవడంతో పంట సాగు తగ్గడంతో ధరలు పెరుగుతున్నాయి.



వెజి‌ట్రబుల్

బెజ్జూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. ప్రజల అవసరాల మేరకు సాగులేక మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో కూరగాయలు, ఆకు కూరలు పండిస్తుండగా, రెండు నెలలుగా వేగంగా అడుగంటుతున్న భూగర్భ జలాలతో సాగు విస్తీర్ణం మరింత పడిపోయే పరిస్థితి దాపురించింది. జిల్లాలో ఆశించిన స్థాయిలో కూరగాయలు పండకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలు, ఆకు కూరలు పండించేలా రైతులను ప్రోత్సహించాలని గత పదేళ్లుగా ప్రభుత్వాలు పేర్కొంటున్నా ఆ ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. ఫలితంగా జిల్లాలో కూరగాయలు, ఆకు కూరల సాగు అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ఇతర పంటలతో పోలిస్తే కూరగాయలు సాగు చేసే రైతులకు తక్కువ రోజుల్లో ఆదాయం చేతికందే అవకాశం ఉంటుంది. రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వెజిటబుల్ హబ్‌గా ప్రకటించి రైతులను ప్రోత్సహిస్తే ఇతర ప్రాంతాలకు సరపరా చేసే విధంగా కూరగాయలు, ఆకు కూరల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.



బెజ్జూర్ మండలంలో సాగు చేస్తున్న ఆకుకూరలు

పలు మండలాల్లో..

జిల్లాలోని పలు మండలాల్లో టమాట, వంకాయ, కాకరకాయ, బెండకాయ, మిర్చి, పర్వాలు, పాలకూర, మెంతి, తోటకూర వంటి కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా పండిస్తున్నారు. జిల్లాలో కూరగాయలు, ఆకు కూరల సాగులో ఇతర మండలాలతో పోలిస్తే కాగజ్‌నగర్ మండలం అగ్రస్థానంలో ఉంది. కాగజ్‌నగర్ మండలంలో నజ్రూల్‌నగర్ ఏరియాలో అధికంగా ఆకు కూరలతో పాటు ఇతర కూరగాయలను బెంగాలీలు పండిస్తున్నారు. ఆ తర్వాత వాంకిడి మండలం ఉంది. ఇక బెజ్జూరు, చింతమానేపల్లి, సిర్పూర్(టి), కౌటాల, వంటి మండలాల్లో కొన్ని రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. జిల్లాలో కూరగాయల సాగుకు సరైననీటి లభ్యత లేక పోవడం, ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి సరైన ప్రోత్సాహం అందక జిల్లాలో సాగు గణనీయంగా పడిపోతోంది. దీంతో గ్రామాల్లో రైతులు సాగు కూరగాయలు స్థానికంగా అవసరాల మేరకు మాత్రమే సరిపోతుంది. ఇతర ప్రాంతాలకు ఎగుమతికి అవకాశం లేక ఇక్కడికి ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సబ్సిడీపై విత్తనాలు..

కూరగాయల సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు సరపరా చేసి ప్రోత్సహించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. రైతులను ప్రోత్సహిస్తేనే కూరగాయలు, ఆకు కూరల సాగు విస్తీర్ణం పెరిగేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పామాయిల్ సాగును ఏ విధంగా ప్రోత్సహిస్తున్నదో అదే తీరులో కూరగాయల సాగు పెరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో నీటి వసతి ఉన్న రైతులే కూరగాయల సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వం జిల్లాలో కూరగాయల సాగు పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటించినా ఆచరణకు నోచుకోవడం లేదు. ప్రభుత్వం కూరగాయల సాగుకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రోత్సాహం లేక..

రైతులకు ప్రోత్సాహం అందక అధికంగా వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. కూరగాయలకు సుస్థిరమైన ధరలు లేక పోవడం, సాగుకు అవసరమైన వసతి వంటి కారణాలతో వాటి వైపు రైతులు మొగ్గు చూపడం లేదు. వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి పంటలను సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతుండటంతో కూరగాయల సాగుపై దృష్టి సారించలేకపోతున్నారు. జిల్లాలో ఏటేటా కూరగాయల సాగు తగ్గిపోతోందన్న అభిప్రాయాలు ఉన్నాయి. జిల్లాలో వానాకాలం, యాసంగిలో కలిపి 5,950ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో పర్వాలు 780 ఎకరాలు, టమాట 750ఎకరాలు, వంకాయ 684 ఎకరాలు, తోటకూర 334ఎకరాలు, మిర్చి 1,690ఎకరాలు, ఇతర పంటలు 280ఎకరాల్లో సాగు చేస్తున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సాగుకు అవసరమైన పరికరాలు, సబ్సిడీ అందించి సాగును ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

ప్రోత్సాహం అందించాలి..

గుర్లె మధుకర్, రైతు



కూరగాయల సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత మేలు కలిగే అవకాశం ఉంటుంది. విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందిస్తే మరికొంత మం ది రైతులు సాగు చేసే అవకాశం ఉంది. మార్కెట్‌కు తరలించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

హామీ అమలు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. హామీ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 25న ఉద్యోగ సంఘాలు చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమం పోస్టర్లను శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు స్థానిక కల్పిస్తామని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో సైతం పెట్టారని గుర్తు చేశారు. అధికారం చేపట్టి 15 నెలలు దాటినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పృధ్వి, వెంకటేష్, సంతోష్, సాయి, సతీష్, శ్రీలేఖ, సౌమ్య, డీవీఎస్‌మూర్తి, మల్లేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన ముగ్గురి రిమాండ్



విచారణ చేపడుతున్న ఎస్సై రాజు

దహెగాం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వివాహితను అదనపు కట్నం కోసం వేధించిన దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులను శనివారం రిమాండ్‌కు తరలించామని ఎస్సై కె రాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం రాస్పెల్లి గ్రామానికి చెందిన పెర్క జ్యోతికి 14 ఏళ్ల క్రితం దహెగాం మండలం కోత్మీర్ గ్రామానికి చెందని బొలిశెట్టి వెంకటేశ్వర్‌తో వివాహమైంది. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం వెంకటేశ్వర్‌కు సింగరేణిలో ఉద్యోగం వచ్చింది. అప్పటి నుంచి అదనపు కట్నం తీసుకు రావాలని భార్య జ్యోతిని వెంకటేశ్వర్ వేధిస్తున్నాడు. అదనపు కట్నం తీసుకు రాక పోతే చంపుతానని బెదిరించే వాడు. ఈ నెల 17న ఉదయం అత్త భాగ్య, మామ మొండయ్య, భర్త వెంకటేశ్వర్లు జ్యోతికి గడ్డి మందు తాగించారని బాధితురాలి తల్లి సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వాహనంలో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. కాగజ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ ముజీసం, ఎండీ తాజ్ అనే వ్యక్తులు కాగజ్‌నగర్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి సేకరించిన 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంలో మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు లంజన్‌వీరా ఎక్స్ రోడ్డు సమీపంలో పట్టుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్

వాంకిడి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్ అన్నారు. మండలంలోని ఖేడేగాం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ తౌఫిక్ లబ్ధిదారులకు ఆహార పదార్థాలను ఉపయోగించి అనుబంధ ఆహార వంటలను తయారు చేయడం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణి మొదటి రోజు నుంచి బిడ్డ రెండేళ్ల వయస్సు నిండే వరకు వెయ్యి రోజుల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో బాలల సంరక్షణ విభాగం సోసల్ వర్కర్ ప్రవీణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు ఇందిరా, రాజకుమారి, వీణ, రత్నమాల, ఉమ, విజయలక్ష్మి, ఏఎన్ఎం సునీత, ఆశావర్కర్ మల్కాబాయి పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో శనివారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యం కోసం తీసుకోవల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయూష్ డాక్టర్ నాగరాజు, సందీప్, శ్రీనివాస్, బక్కయ్య, నాయకులు ఇప్పతుస్సేన్, యోగా గురువు అశోక్ ఆర్య, స్వప్న, అంగన్‌వాడీ టీచర్ రుక్మిణి, సాహెరా బేగం, అర్చన, సాబేర బేగం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 34 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పా టుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్‌లోని సచివాయలం నుంచి శనివారం రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, పౌరసరఫరాల అధికారులతో యాసంగిలో ధాన్యం కొనుగోలు, సన్న బియ్యం పంపిణీ, తాగునీటి సరఫరా అంశాలపై రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకు మార్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. ఇందులో భాగంగా యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు రైతులకు అందుబాటులో కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. యాసంగిలో 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఎనిమిది లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. తాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అధికారులు గోదాముల్లో ఉన్న సన్న బియ్యం నిలువలను పరిశీలించాలని సూచించారు. నాణ్యత తనిఖీ చేయాలన్నారు.ప వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల నుంచి తరలించడానికి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, నీటి పారుదల శాఖాధికారులు సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదా యంలోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ ఎండేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో ధాన్యం కొనుగోళ్లకు 34 కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. 48 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో జిల్లాలో చౌకధరల దుకాణాల ద్వారా అర్హత గల ప్రతీ లబ్ధిదారుడికి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ, జిల్లా నీటి పారుదల శాఖాధికారులు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులు ప్లీనరీకి తరలిరావాలి

రెబ్బెన, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కారులు ఈ నెల 21న సికింద్రాబాద్‌లో చేపట్టే ప్లీనరీకి తరలిరావాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆసిఫాబాద్ రాష్ట్ర కో కన్వీనర్ దుర్గం రవీందర్, ఆసిఫాబాద్ నియోజకవర్గ నియోజకవర్గ కన్వీనర్ బాబు రావు కోరారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమ కారులకు 250 గజాల ఇంటికి స్థలం, రూ.25వేలు పెన్షన్ ఇవ్వాలని చెప్పారు. అలాగే ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. అధికారంలోకి రాకముందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే ప్రణాళికలపై ఈ ప్లీనరిలో చర్చిస్తా రని తెలిపారు. ప్లీనరీకి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో లక్ష్మణ్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలి

సిర్పూర్(టి), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని మణికంఠ ఆసుపత్రిలో శనివారం మంచిర్యాలకు చెందిన మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మరోకరి ప్రాణాలు కాపాడిన వారమవుతారన్నారు. రక్తదానం చేయాలని కోరారు. అనంతరం వైద్య శిబిరంలో పలువురికి చికిత్సలు నిర్వహించి చేయడం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

కాగజ్‌నగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని కొత్తసార్సాల, పాత సార్సాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం తెలంగాణ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల వద్ద సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

జేఈఈలో 274వ ర్యాంకు



రుత్విక్‌రెడ్డి

కౌటాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తలోడి గ్రామానికి చెందిన రుత్విక్‌రెడ్డి ఐఐటీ జేఈఈ (మెయిన్స్) 2025 ఫలితాల్లో ఆల్ ఇండియాలో 274వ ర్యాంకు సాధించాడు. ర్యాంకు సాధించిన రుత్విక్‌రెడ్డిని తల్లిదండ్రులు జ్యోతి, తిరుపతిరెడ్డితో పాటు మండల వాసులు అభినందించారు. ఈ సందర్భంగా రుత్విక్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత ఉద్యోగంలో స్థిరపడడమే ధ్యేయంగా పట్టుదలతో చదివానని తెలిపారు.

రేపు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

సిర్పూర్(టి), ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవా రం భూ భారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో పాటు అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్ హాజరు కానున్నారని తెలిపారు. రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టం వల్ల భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తెలిపారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం

- మండలంలో 26 పంచాయతీల్లో నర్సరీల ఏర్పాటు



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11వ విడత హరితహారంలో నాటేందుకు అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు నాటడంతో అంతరించిపోతున్న అడవులకు ఊపిరి పోయడమే కాకుండా వర్షాలు సమృద్ధిగా కుర వడానికి, వాతావర ణంలో కాలుష్య నివారణకు పచ్చదనం ఎంతో ముఖ్య మని ప్రజలకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. హరితహారం కోసం అవసరమైన మొక్కలు పెంచడానికి మట్టి, విత్తనాల సేకరణపై అధికారులు దృష్టి సారించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా హరితహారం కోసం ఆసిఫాబాద్ మండలంలో 26 గ్రామ పంచాయతీలలో నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీలలో 3.14 లక్షల మొక్కలు పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకొని ప్రణాళికలను సిద్ధం చేశామని సంబంధిత అధికారులు తెలిపారు.

ప్రతి నర్సరీలో..

గ్రామపంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన నర్సరీలలో 12వేల మొక్కలను పెంచడానికి అధికారులు లక్ష్యంగా చేసుకున్నారు. ఇందు కోసం నర్సరీలలో బెడ్ల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపే పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీలకు విత్తనాలను ఆరు మాసాల కిందటే సరఫరా చేశారు. పూలమొక్కలు, పండ్ల మొక్కలతో పాటు గుల్‌మోహర, వేప, కానుగ తదితర మొక్కలను పెంచుతున్నారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలు ఎండ తీవ్రత నుంచి తట్టుకునేందుకు షేడ్‌నెట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఉదయం, సాయంత్రం రెండు సార్లు మొక్కలకు నీళ్లందిస్తున్నారు.



మేనేజర్ విధానాలతో కార్మికులకు ఇబ్బందులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గని మేనేజర్ విధానాలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే 5 గని వద్ద శనివారం గని మేనేజర్ శంభునాథ్‌పాండేకు వ్యతిరేకంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు ధర్నా నిర్వహించారు. మేనేజర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్ మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోనే మంచి రికార్డులు కలిగి ఉన్న కేకే 5 గనికి కొత్తగా వచ్చిన మేనేజర్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారన్నారు. శ్రమదానం పేరిట కార్మికులపై పనిభారం మోపుతున్నారని మండిపడ్డారు. కార్మికులకు సంబంధించి సమస్యలపై మాట్లాడేందుకు వెళితే నిరాకరిస్తున్నాడని చెప్పారు. మేనేజర్‌చర్యలకు నిరసనగా మైన్స్ కమిటీని కూడా బహిష్కరించామన్నారు. దీనిపై ప్రశ్నిస్తే గుర్తింపు సంఘంతో కూడా ఎలాంటి సంబంధం లేదని దురుసుగా మాట్లాడుతున్నాడని తెలిపారు. మంచి కోసం పనులు చేస్తే తాము హర్షిస్తామన్నారు. కానీ సంఘాన్ని నిర్వీర్యం చేసే చర్యలను తాము ఉపేక్షించమని తెలిపారు. ఇప్పటికైనా మేనేజర్ తన విధానాలను మార్చుకోవాలన్నారు. గని అభివృద్ధికి , కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తమ యూనియన్ సిద్ధంగా ఉంటుందన్నారు. ఉన్నతాధికారులు కూడా మేనేజర్ విషయంలో స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కేకే 5 గని ఇన్‌చార్జి కంది శ్రీనివాస్, పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, సోంశెట్టి రాజేశం, శ్రీకాంత్, మైన్స్ కమిటీ, పిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

దేశవ్యాప్తంగా సింగరేణి విస్తరణ


సీఎండీకి నైనీ గని నుంచి తీసిన తొలి బొగ్గు పెళ్ల చిత్రపటం అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని నైనీ బ్లాకు నుంచి బొగ్గును ఉత్పత్తి చేయడం ద్వారా సింగరేణి తన వ్యాపారాన్ని దేశవ్యాప్తంగా విస్తరించిందని సీఎండీ ఎన్ బలరాం అన్నారు. శనివారం ఆయన అన్ని ఏరియాల జీఎంలు, యూనియన్ల నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇదే స్ఫూర్తితో ఇతర రాష్ట్రాల్లోనూ సంస్థను విస్తరిస్తామని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల పాటు అనేక మంది సింగరేణి అధికారులు శ్రమించడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. సింగరేణి బొగ్గు, థర్మల్ విద్యుత్ రంగంలో ఉందని, ఇకపై పునరుత్పాదక రంగంలోకి విస్తరిస్తామని తెలిపారు.

సీఎండీకి సన్మానం

నైనీ బ్లాకు ప్రారంభించిన సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు సీఎండీ బలరామ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయనను సన్మానించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, నైనీ బ్లాకును ప్రారంభించంలో రాష్ట్ర ప్రభుత్వ కృషితో పాటు సీఎండీ చొరవ ఎంతో ఉందని కొనియాడారు. ఇది ఒక చారిత్రాత్మక ఘట్టమని సీఎంపీఓఏ ప్రతినిధులు పేర్కొన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(కోల్ మూమెంట్) ఎస్‌డీ సుభాని నైనీ గని నుంచి తీసిన తొలి బొగ్గు పెళ్ల సంబంధించిన చిత్రపటాన్ని సీఎండీకి బహూకరించారు. సమావేశంలో డైరెక్టర్(ఈ అండ్ ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ఆపరేషన్స్) సూర్యనారాయణ రావు, డైరెక్టర్(ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వర్లు, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(మార్కెటింగ్) రాజశేఖర్ రావు పాల్గొన్నారు.

ఐడీ కార్డులు అందజేయాలి

సింగరేణిలో పనిచేసే కార్మికులకు ఐడీ కార్డులు అందించాలని ఏబీకేఎంఎస్-బీఎంఎస్) కార్యదర్శి పి. మాధవ నాయక్ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో సీఎండీకి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవతో నైనీ బ్లాకు ప్రారంభమైందన్నారు. నైనీలో విలువైన బొగ్గు ఉందని తెలిపారు. కార్మికులందరికి ఐడీ కార్డులు ఇవ్వాలని ఆయన వినతిపత్రం అందజేశారు.

కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలులో యాజమాన్యం విఫలం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కోడ్ ఆఫ్ డిసిప్లేన్ అమలులో యాజమాన్యం విఫలమైందని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా ఆరోపించారు. యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థ నైనీ బ్లాకులో బొగ్గు ఉత్పత్తి ప్రారంభించిన సందర్భంగా సీఎండీ ఎన్ బలరాం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారన్నారు. ఈ వీసీ ద్వారా ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులతో మాట్లాడి అభినందనలు తెలిపేందుకు, దానిని తాము శ్రీరాంపూర్, రామగుండం, మందమర్రి ఏరియాలలో బహిష్కరించామన్నారు. కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌కు విరుద్ధంగా ఏరియాలలో గుర్తింపు సంఘం నాయకులతో పాటు ప్రాతినిధ్య సంఘం నాయకులను పిలవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ నాయకుల మన్ననలు పొందేందుకు సీఎండీ ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి చర్యల వల్ల తాము ఆవేదనకు గురయ్యామని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఇలాంటి అనాలోచిత చర్యలు మానుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కిషన్ రావు, సహాయ కార్యదర్శి మోత్కూరు కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ రూ.10వేలుగా నిర్ణయించాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల కనీస పెన్షన్‌ను రూ.10వేలుగా నిర్ణయించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ కోరారు. ఈ మేరకు ఆయన శనివారం సీఎం పీఎఫ్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విక్రమ్ దేవ్‌దత్‌కు లేఖ రాశారు. 1989లో దివంగత ఎంపీ గడ్డం వెంకట స్వామి ప్రవేశపెట్టిన పింఛన్ పథకాన్ని సవరించలేదని పేర్కొన్నారు. దీని వల్ల ఉద్యోగ విరమణ పొందుతున్న వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

విద్యార్థిని అనుమానాస్పద మృతి

జైపూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి గ్రామానికి చెందిన గంగాధరి కృష్ణవేణి (21) సూర్యపేట జిల్లా చిలుకూరు మండలం గేట్ ఇంజనీరింగ్ కాలేజీలో అనుమానాస్పదంగా మృతి చెందింది. పెగడపల్లికి చెందిన మాజీ సర్పంచు గంగాధరి లక్ష్మీ-లింగయ్యల కూతురు కృష్ణవేణి గేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతోంది. కృష్ణవేణి ఉగాది పండగకు పెగడపల్లికి వచ్చింది. ఈ నెల 18న తల్లితో కలిసి సాయంత్రం కాలేజీకి వెళ్లింది. రాత్రి తల్లితో కలిసి హాస్టల్‌లోనే గడిపింది. తెల్లవారుజామున తల్లి గదిలో ఉండగానే కాలేజీ భవనంపై నుంచి దూ కడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. కళాశాల యాజమాన్యం పోలీసులకు అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలను సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

నెన్నెల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గిరిజన తండాకు చెందిన 15 ఏళ్ల బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఇటీవల పదో తరగతి పరీక్షలు రాసి ఇంటివద్ద ఉంటున్న బాలికపై వరసకు బావ అయ్యే వక్తి చేతులు వేసి దగ్గరికి లాక్కొనే ప్రయత్నం చేశాడని చెప్పారు. బాధితురాలు తల్లికి విషయం చెప్పడంతో వారు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

దండేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భావోద్వేగాలను అదుపు చేసిన వ్యక్తి సమాజ ప్రగతికి మలుపు తిప్పుతారని మోటివేషనల్ స్పీకర్ చిట్ల రాజన్న అన్నారు. శనివారం పిఎంశ్రీ దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలోని జరిగిన చెలిమి ఎమోషనల్ వెల్ బీయింగ్ కార్యక్రమంలో భాగంగా 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, అధ్యక్షత వహించగా, కార్యక్రమ సమన్వయకర్తలుగా అప్పాల మనోహర్, రమేష్ వ్యవహరించారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

కాసిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల అధిక పంట దిగుబడులు సాధించుకోవచ్చునని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు.

కామ్రేడ్ మహ్మద్‌గౌస్‌కు నివాళి

బెల్లంపల్లి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ మహ్మద్‌గౌస్ ఆశయ స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఎంసీపీ ఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలో మహ్మద్‌గౌస్ నాల్గవ వర్ధంతిని ఎంసీపీఐయు పార్టీ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆర్డీవోకు వినతి

కాసిపేట, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కళ్యాణఖని మెగా ఓసీపీలో ముంపుకు గురైన దుబ్బగూడెం అర్హులైన నిర్వాసితులందరికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని శనివారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, సరిత, సుమలత, స్వేత, రాజ్య లక్ష్మీ, లక్ష్మీ, రాజేశ్వరి పాల్గొన్నారు.

పుట్టిన రోజునే అనంత లోకాలకు..

● గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి ● మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళన


మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న బంధువులు, గ్రామస్థులు(ఇన్‌సెట్‌లో అశోక్(ఫైల్))

కోటపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు నాడే ఓ యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. కోటపల్లి మండలంలోని పారుపెల్లి గ్రామానికి చెందిన పూరెళ్ల అశోక్ (20) అనే యువకుడు శుక్రవారం సాయంత్రం గోదావరి నదికి స్నానానికి వెళ్లి గల్లంతు కాగా శనివారం ఉదయం నదిలో శవమై తేలాడు. కుటుంబీకుల కథనం ప్రకారం పుట్టిన రోజు సందర్భంగా నదిలో స్నానం చేసి గుడికి వెళ్లాలనుకున్నాడు. ఇంటి నుంచి వెళ్లిన అశోక్ చీకటి పడినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు నది ప్రాంతమంతా గాలించగా ఒక చోట దుస్తులు, చెప్పులు కనబడ్డాయి. అశోక్ జాడ తెలియకపోగా చీకటి కావడంతో వెళ్లిపోయారు. మరునాడు శనివారం ఉదయం అదే ప్రాంతంలో గాలించగా అశోక్ నీటిపై శవమై తేలి ఉండటాన్ని గుర్తించి బయటకు తీశారు. ఆ ప్రాంతమంతా కూడా ఇసుక తవ్వకాల కోసం తవ్విన గుంత కావడం, గుంతలో నీరు నిలిచి ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందినట్లు గ్రామస్థులు, కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. గోదావరి అవతలి ప్రాంతమైన కుంట్లం రేవు వద్ద నుంచి ఇసుకను కోటపల్లి మండలంలోని ఎర్రాయిపేట ప్రాంతానికి తీసుకువచ్చి స్టోరేజీకి అనుమతులు ఉండగా ఇందుకోసం నదిలో ఇసుక కాంట్రాక్టర్ రహదారిని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ రహదారి నిర్మాణానికి ఇసుకను తవ్వడంతో గోతులు ఏర్పడ్డాయి. స్నానానికి వెళ్లిన అశోక్ గోతిలో పడి మృతిచెందాడు. మృతునికి తల్లిదండ్రులతో పాటు ముగ్గురు సోదరులు ఉన్నారు. డిగ్రీ చదువుతున్న అశోక్ వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా ఉండడం, మరో వైపు పుట్టిన రోజునే అనంత లోకాలకు చేరడంతో కుటుంబీకులు విషాదంలో మునిగిపోయారు.

మృతదేహంతో జాతీయ రహదారిపై ధర్నా

ఇసుక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, రోడ్డు నిర్మాణం కోసం తవ్విన గుంతలో పడి అశోక్ మృతిచెందడంతో అతడిపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని 63వ నెంబరు జాతీయ రహదారిపై మృతదేహంతో బంధువులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన తీవ్రస్థాయికి చేరడంతో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, తహసీల్దార్ రాఘవేందర్‌రావులు సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిస్థితి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బుజ్జిబాబు తెలిపారు.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫైనాన్స్ కంపెనీలు..

(1వ పేజీ తరువాయి)

వడ్డీ వ్యాపారం చేసేవారిపై కూడా దృష్టిసారించగా, పలువురు వ్యాపారుల ఇళ్ల లోనూ సోదాలు చేశారు. కొంతకాలంగా పోలీసులు దృష్టి సారించకపోవడంతో ఫైనాన్షియర్ల ఆడగాలు శృతిమించుతున్నాయి.

బ్లాంకు చెక్కులు తనఖా..

ఫైనాన్స్ కంపెనీలు, చిట్ ఫండ్స్‌తో సహా ఇతరత్రా వడ్డీ వ్యాపారం చేసే కంపెనీలు వినియోగదారుల వద్ద బ్లాంక్ చెక్కులు తీసుకొని లావాదేవీలు నిర్వహించడం చట్టరీత్యా నేరం. అలాగే అప్పు తీసుకున్న వారి ఆస్తులను స్వాధీనం చేసుకోవడం, రుణ గ్రహీతలను వేధింపులకు గురి చేయడం లాంటివి చేయకూడదనే నిబంధనలు ఉన్నా అవేమీ పాటించడం లేదు. అప్పు ఇచ్చే క్రమంలో తీ సుకొనే బ్లాంక్ చెక్కులు, ప్రాంసరీ నోట్ల ఆధారంగా కోర్టుల్లో కేసులు వేసి, మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. బంగారం, భూముల డాక్యుమెంట్లు కుదువ పెట్టుకొని అప్పులు ఇస్తూ, వడ్డీలు కట్టడంలేదనే సాకుతో కొంతకాలం తర్వాత వాటిని స్వాధీనం చేసుకోవడం ఇక్కడ నిత్య కృత్యమైంది. ఫైనాన్షియర్లు ష్యూరిటీ కింద తీసుకుంటున్న బంగారం, బ్లాంక్ చెక్కులను బ్యాంక్ లాకర్లలో దాచి ఉంచుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలోనూ పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి

కాసిపేట, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు పాల్పడిన గిరిజన రైతు నాయిని కన్నయ్య కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. శనివారం మండలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4న కన్నయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది ఆత్మహత్య కాదు కన్నయ్యను పెత్తందారులే హత్యచేసినట్లుగా భావించి వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'హిందువులపై దాడులు అమానుషం'

బెల్లంపల్లి, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాల్‌లో హిందువులపై దాడులు చేయడం అమానుషమని విశ్వహిందు పరిషత్ నాయకులు అన్నారు. శనివారం హిందువులపై దాడులు ఆపాలని కోరుతూ ఆర్డీవోకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వెంటనే హిందువులపై దాడులు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని లేని యెడల ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

గర్మిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని మైనార్టీ ఫంక్షన్ హాలులో హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు శనివారం డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్, ఉప జిల్లా వైద్యాధికారి అనిత ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హజ్ వెళ్లే 40 మంది యాత్రికులకు ఇన్ఫ్లుంజామీనింగ్ కొకల్ ఓపీవీ వ్యాక్సిన్ ఇచ్చామని, అలాగే బీపీ, ఇతర పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్‌లు ముస్తాఫా, అశోక్, స్నేహిత, రాము, అఖిల్, పాషా, ముస్లీం పెద్దలు ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భీమిని, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భీమిని మండలంలోని చిన్నగుడిపేట, కేస్లాపూర్ గ్రామాల లబ్ధిదారులకు శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ముగ్గురు లబ్ధిదారులకు రూపాయలు 1,03,500 విలువ గల చెక్కులను పెసరి రాజన్న, ముదగిరి బీరయ్య, రజితలకు చెక్కులు అందించారు. ప్రభుత్వం అందించే సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా

కౌటాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం కన్నెపల్లి గ్రామంలో శనివారం పశువైద్యాధికారి డాక్టర్ అంజలి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి మే 15 వరకు నెల రోజుల పాటు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయనున్నామని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్‌కు యువకుడి వేధింపులు


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్‌కు ఓ యువకుడి నుంచి ప్రేమ పేరుతో వేధింపులు ఎక్కువ కావడంతో మందమర్రి పట్టణంలోని 1వజోన్ సీఈఆర్ క్లబ్ సమీపంలో నివాసం ఉంటున్న అజయ్ అనే యువకుడి ఇంటి ఎదుట శనివారం ట్రాన్స్‌జెండర్లు బైఠాయించి ధర్నా నిర్వహించారు. యువకుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలనీవాసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాన్స్‌జెండర్ల వద్దకు వచ్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ చందన అనే ట్రాన్స్‌జెండర్‌ను ప్రేమ పేరుతో అజయ్ వేధిస్తున్నాడని చెప్పారు. అర్ధరాత్రి గోడ దూకి ఇంట్లోకి వస్తున్నాడని తెలిపారు. ఫోన్‌కాల్స్, వాట్సాప్ వీడియోకాల్స్ చేస్తూ పెళ్లి చేసుకోకపోతే చనిపోతానంటూ బెదిరిస్తున్నాడని పేర్కొన్నారు. తరుచూ వేధిస్తూ మానసికంగా వేధిస్తున్నాడని, డబ్బులు కావాలని కూడా బెదిరిస్తున్నాడని తెలిపారు. తమకు న్యాయం చేయాలని అజయ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు తమకు రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అయినప్పటికీ ముందస్తు చర్యల్లో భాగంగా అజయ్‌ను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. అతనికి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి ఆధారాలు సేకరిస్తున్నామని తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదు

బెల్లంపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని తాళ్లగురిజాల సీఐ అఫ్జలొద్దీన్ అన్నారు. శనివారం సీఐ కార్యాలయంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న యువకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. యువత మద్యం, గంజాయి సేవించడంతో నేర ప్రవృత్తికి అలవాటుపడతారని యువత చదువు, క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. దురలవాట్లకు బానిసకాకుండ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఎవరైన బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాళ్లగురిజాల ఎస్ఐ రమేశ్ పాల్గొన్నారు.

సీఎం, ఎంపీ, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీ 1 ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దివంగత కాకా వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. రిటైర్డు కార్మికుల పెన్షన్ పెంపుదల కోసం రూ. 140 కోట్ల నిధులు కేటాయించేలా ఎంపీ కృషి చేసినందుకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా నాయకులు సొత్కు సుదర్శన్, పట్టణాధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్‌లు మాట్లాడుతూ ఎంపీగా గెలిచిన నాటి నుంచి రిటైర్డు కార్మికుల పెన్షన్ కోసం గలమెత్తిన నాయకుడు ఎంపీ వంశీకృష్ణ అని పేర్కొన్నారు. సింగరేణిపై, కేంద్రంపై పెన్షన్ పెంపై ఒత్తిడి తెచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గుడ్ల రమేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, గడ్డం రజనీ, జమీల్, ఫైడిమల్ల నర్సింగ్, మంద తిరుమల్‌రెడ్డి, శంకర్, రాజు, రమేష్, రాజు, పాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

గర్మిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు కలెక్టరేట్ కార్యాలయం సూపరింటెడెంట్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నగనూరి వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకుల రఘునాథ్ వెరబెల్లిలు మాట్లాడుతూ తాలు తప్ప తాలు పేరుతో ఎలాంటి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు వెంట వెంటనే చేటప్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, పురుషోత్తం, వెంకరటమణరావు, కృష్ణమూర్తి, సతీష్‌రావు, స్వామిరెడ్డి, అశ్విన్, సత్యం, ప్రశాంత్, వెంకట్‌రెడ్డి, ధర్మయ్య, తిరుపతి పాల్గొన్నారు.

అధికారులు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి


వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌లో గల మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శనివారం ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నుంచి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం కింద అర్హులైన వారికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు చేపడుతున్న దరఖాస్తుల స్వీకరణ పారదర్శకంగా చేపడుతున్నామని చెప్పారు. ఈ పథకం కింద రూ.50 వేల నుంచి 4 లక్షల వరకు పలు యూనిట్ల కింద దరఖాస్తులు స్వీకరిస్తు న్నామని అన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన యువత దరఖాస్తు చేసు కోవాలని సూచించారు. ఆయన వెంట మండలాభివృద్ధి అధికారి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.



చిత్రజ్యోతి

SINCE 1965



ఆ లోటును భర్తీ చేస్తుంది

- మోహనకృష్ణ ఇంద్రగంటి

'అష్టాచెమ్మ', 'గోల్కొండ హైస్కూల్', 'సమ్మోహనం' వంటి చిత్రాలతో సెన్సిబుల్ దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు మోహనకృష్ణ ఇంద్రగంటి. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. ప్రియదర్శి, రూప కొడవాయూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. ఈ నెల 25న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మోహనకృష్ణ మీడియాతో ముచ్చటించారు. "ఒకప్పటితో పోల్చితే తెలుగులో పూర్తి స్థాయి కామెడీ చిత్రాల సంఖ్య తగ్గిపోయింది. ఆ లోటును భర్తీ చేస్తుందీ చిత్రం. కథానాయకుడి పాత్రకు ఎవరు సరిపోతారా అని వెతికే క్రమంలో, ప్రియదర్శి నటించిన 'బలగం'తో పాటు ఆయన చేసిన మరికొన్ని చిత్రాలు చూశా. ఈ కథకు ఆయనే సరిపోతారనిపించింది. ఇందులో పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. కేవలం థియేటర్లో చూసి ఆనందించడమే కాకుండా.. కొన్ని రోజుల పాటు మాట్లాడుకునేలా ఉంటుందీ సినిమా. అన్ని వర్గాలను మెప్పించే ఈ చిత్రం, కాసేపు మీ కష్టాలన్నింటినీ మర్చిపోయేలా చేస్తుంది. జాతకాలను అతిగా నమ్మే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలే చిత్రకథాంశం. నమ్మకం మూఢనమ్మకంగా మారి, ఇతరుల్ని ఇబ్బందిపెట్టకూడదనే సందేశాన్ని వినోదాత్మకంగా అందిస్తుంది. సినిమాలో కడుపుబ్బా నవ్వుకునే వినోదంతో పాటు ఓ క్రైమ్ ఎలిమెంట్ ఉంటుంది. అది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడిగా ఈ సినిమా నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఇప్పుడు ప్రేక్షకుల అటెన్షన్ స్పాన్ తగ్గిపోయింది. వారు థియేటర్లో మొబైల్ తీయకుండా ఉంచగల స్థాయిలో సినిమాలు తీయడం దర్శకులు నేర్చుకోవాలి" అని చెప్పారు.




ఎన్ని అబద్ధాలు చెప్పినా మా సినిమా గెలుస్తుంది

విజయశాంతి

"అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు పాదాభివందనాలు. క్లైమాక్స్ కోసం కల్యాణ్‌బాబు తీసుకున్న రిస్క్ వల్లే సినిమా ఇంత గొప్పగా వచ్చింది. సినిమాకు నెగెటివ్ ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదు. దుష్ప్రచారం చేసేవారు దయచేసి మైండ్‌సెట్‌ను మార్చుకోండి. వారు సినిమా బాగాలేదని ఎన్ని అబద్ధాలు చెప్పినా, చివరికి మా సినిమానే గెలుస్తుంది. కోట్లు ఖర్చు పెట్టి తీసిన సినిమాను బ్రతకనివ్వండి. మనస్ఫూర్తిగా సినిమాను దీవించడం నేర్చుకోండి" అని నటి విజయశాంతి అన్నారు. కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించిన ఈ చిత్రం ఇటీవలె విడుదలైంది. సక్సెస్ మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "కమర్షియల్ సినిమాలోనూ కొత్తదనం ఉంటేనే ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. ఈ విషయంలో దర్శకుడు ప్రదీప్ ప్రేక్షకుల అంచనాలను అందుకున్నాడు" అని చెప్పారు.













పుట్ట గొడుగుల్లా ఫైనాన్స్ కంపెనీలు..



- అధిక వడ్డీ వసూలుతో నడ్డి విరుస్తున్న నిర్వాహకులు
- బ్లాంక్ చెక్కులు, ప్రామిసరీ నోట్లతో ష్యూరిటీలు

మంచిర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రోజు రోజుకూ వడ్డీ వ్యాపార సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అధిక వడ్డీలు వసూ లు చేస్తూ సామాన్యుల జీవితాలను బుగ్గి పాలు చే స్తున్నాయి. రూ. 3 నుంచి రూ. 10 వరకు వడ్డీలు వ సూలు చేస్తూ కోట్లకు పడగలెత్తున్నాయి. ఎలాంటి లెక్కలు, పత్రాలు లేకుండా అక్రమంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ అందినకాడికి దండు కుంటున్నాయి. వడ్డీ వ్యాపారుల దెబ్బకు సామాన్య ప్రజలతోపాటు చిరు వ్యాపారులు విలవిల్లా డుతుండగా, నెలసరి వడ్డీలు చెల్లించని వారిపట్ల కఠిన వైఖరి అవ లంబిస్తున్నారు. సామాన్య ప్రజల అవసరాన్ని వ్యాపారంగా మలుచుకుంటూ అడ్డగోలు వసూళ్లకు పా ల్పడుతున్నారు. హైర్ పర్చేజ్ అండ్ ఫైనాన్స్‌ల పేరు తో విలువైన డాక్యు మెంట్లు తనఖా పెట్టుకుంటూ బ్లాక్ మెయిళ్లకు పాల్పడుతున్నారు. రిజిస్ట్రేషన్‌లు ఉ న్న ఫైనాన్స్‌ల్లో సైతం జామీనుగా బ్లాంక్ చెక్కులు, ప్రాంసరీ నోట్లు ష్యూరిటీ కింద తీసుకోకూడదనే ని బంధనలు ఉన్నప్పటికీ, వాటి ఆధారంగానే అప్పులు ఇవ్వడం పరిపాటిగా మారింది. రిజిస్ట్రేషన్ల శాఖ ని యమ, నిబంధనల ప్రకారం ఫైనాన్స్ కంపెనీలు అ న్ని రికార్డులు సక్రమంగా నిర్వ హించాల్సి ఉండగా, అవేమీ లేకుండానే వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ఫైనాన్స్ కంపెనీలు...

మంచిర్యాల జిల్లాలో ఫైనాన్స్ కంపెనీలు పుట్టగొడుగుల్లా వెలుస్తు న్నాయి. రిజిస్ట్రేషన్లు కలిగి ఉన్న వా టికంటే ఎలాంటి నిబంధనలు పాటించకుండా వడ్డీ వ్యాపారం చేసేవాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. మంచిర్యాలలో ఈ పరిస్థితి మరింత భయంకరంగా తయారైంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు, జ్యూయలరీ షాపు లు, వందలాదిగా ప్రైవేటు వ్యక్తులు ఫైనాన్స్ సంస్థలను నెలకొల్పుతూ అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. వడ్డీ వ్యాపారానికి సంబంధించి ఎన్నో చట్టా లు ఉన్నా అవి కాగితాలకే పరిమితం కావడంతో వ్యాపారులు ఆడిందే ఆటగా పరిస్థితి తయారైంది. వడ్డీ వ్యాపారం చేయాలంటే జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి లైసెన్సు పొందడం తప్పనిసరి. అయితే జి ల్లాలో లైసెన్సు ఉన్న ఫైనా న్స్ సంస్థల కంటే అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేసే వారి సంఖ్య అపరిమి తంగా ఉంది. గత ఏడాది ఫైనాన్స్ కంపెనీలపై దాడులు నిర్వహించిన పోలీసులు పెద్ద మొత్తంలో బ్లాంక్ చెక్కులు, ప్రాంసరీ నోట్లు స్వాధీనం చేసుకు న్నారు. అనధికారికంగా.. (తరువాయి 2లో)

విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఏసీసీ సబ్ స్టేషన్, రాజీవ్ నగర్ 33కేవీ లైన్ విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలి పారు. జాఫర్‌నగర్, జన్మభూమినగర్, ఇందిరానగర్, మార్కెట్‌ఏరియా, హైటె క్‌సిటీ, అండాలమ్మ కాలనీ, లక్ష్మీనగర్, గౌతమినగర్, ఇస్లాంపుర, ఎంసీసీ, గొ ల్లవాడ, సావిత్రినగర్, ఒడ్డెర కాలనీ, మారుతినగర్, గ్రీన్‌సిటీ, శ్రీనివాసగార్డెన్ ప్రాంతాల్లో కరెంటు ఉండదని తెలిపారు.

ఎస్సైతో నాకు సంబంధం లేదు

నస్పూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సై సుగుణాకర్‌కు బినామీ అని, తన ద్వారా రూ. 30వేల రూపాయలు తీ సుకున్నడని తన పేరును ఏసీబీ అధి కారులు మాట్లాడడం అన్యాయమని మంచిర్యాలకు చెందిన దాస్యపు దీపక్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్ క్ల బ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడుతూ ప్ర భంజన్ కేసులో తనకు ఎస్సైకి ఏలాం టి సంబంధం లేదన్నారు. తన పేరును అన్యాయంగా చేర్చారని, ఏసీబీ అధికా రులు మరోసారి విచారణ చేసి న్యా యం చేయాలని కోరారు. ఉన్నతాధికా రులకు పిర్యాదు చేస్తానని చెప్పారు. విచారణ జరిపి తన పేరును తొల గించాలని, ప్రభంజన్, అతని మిత్రుడు సాయిరెడ్డిలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మహేష్ పాల్గొన్నారు.

పోషణ్ పక్వాడా కార్యక్రమం

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొక్కూరు గ్రామం లోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల లో శనివారం పోషణ్‌పక్వాడా కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, అలాగే సంతులిత ఆహారం ఆరోగ్యం అనే అం శంపై వ్యాసరచన పోటీలను నిర్వహిం చారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థు లకు బహుమతులు అందజేశారు. అనంతరం పోషకాహారం ప్రాముఖ్యత పై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దత్తకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల నిరసన

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట శనివారం బీఆర్ఎస్ నాయ కులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సం దర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహిం చే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు సంబం ధించిన వాల్ రైటింగ్‌పై మున్సిపల్ అ ధికారులు సున్నం వేసి రైటింగ్ తొల గించడం దారుణమన్నారు. మున్సిపల్ కమిషనర్ కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామికి తొత్తుగా వ్యవ హరిస్తున్నాడని ఆరోపించారు.

బీఆర్ఎస్ స్పందనను ఓర్వలేకపోతున్న కాంగ్రెస్

- ఎక్స్' వేదికగా మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపణ

మంచిర్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించతలపెట్టిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వస్తు న్న స్పందన చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఓర్వలేకపోతున్నదని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ శనివారం 'ఎక్స్' వేధికగా ఆరోపించారు. రజతోత్సవ స భకు సంబంధించి చెన్నూరు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయ కులు వేసిన వాల్‌రైటింగ్‌ను కాంగ్రెస్ ఆదేశాలతో మున్సిపల్ అ ధికారులు చెరిపివేయడమే దీనికి నిదర్శనమన్నారు. ఎవరు ఎన్ని కుయుక్తులు చేసినా, సభ విజయవంతం అవుతుందన్నారు.

భారత సైన్యంలో ఉద్యోగం సాధించిన విద్యార్థి

బెల్లంపల్లి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన సాయికుమార్ అగ్నివీర్ పోటీల్లో పాల్గొని ఇండియన్‌నేవిలో ఉద్యోగం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కాం పెల్లి శంకర్ తెలిపారు. 2025 జరిగిన ఎంపిక పోటీల్లో సాయికు మార్ ప్రతిభచాటి ఉద్యోగం సాధించారన్నారు. ఈ నెల 14న ఇండి యన్ నేవిలో టెక్నికల్ ఆర్గనైజేషన్ అధికారిగా విధుల్లో చేరాడు.

మీ సేవ కేంద్రం సీజ్

తాండూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని శనివారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ తెలిపారు. మీ సేవ కేంద్రం నిర్వహకుడు భీమ ప్రవీణ్ అధిక చా ర్జీలు వసూలు చేయడం, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం, దరఖాస్తు దారుని సంతకం లేకుండా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఆన్‌లైన్ చేశాడన్నారు. వీటిపై పరిశీలన జరిపి మీ సేవా కేంద్రాన్ని సీజ్ చే శామని తదుపరి చర్యలపై కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామన్నారు.

గ్రామస్థులు ఆందోళన చెందవద్దు



మాలగురిజాల గ్రామంలో ఇంటింటా సర్వే చేపడుతున్న వైద్య బృందం

బెల్లంపల్లి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండ లంలోని మాలగురిజాల గ్రామంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆదేశాల మేరకు నిమ్స్ వైద్య బృందం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ బృందం ఇంటింటా సర్వే చేపట్టారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు గ్రామంలో ఎంత మంది ఉన్నా రని తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి 153 మంది వివరాలను వారి ఆరోగ్య వివరాలను సేకరించారు. తాగునీరు, ఆహారప దార్థాలు ఎటువంటివి తీసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం 153 మందికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సేకరించిన రక్తనమూ నాలను టీహబ్‌కు పంపించామని వాటి ఫలితాల ఆధారంగా పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి హరీశ్‌రాజ్, డిప్యూటి డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్, నిమ్స్ వైద్యులు చరణ్‌రాజ్, విజయ్‌చందర్, నిరంజన్, శంకర్, వైద్య బృందం పాల్గొన్నారు.

కులమతాల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీ

- డీసీసీ అధ్యక్షురాలు సురేఖ



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి సంక్షేమాన్ని మరిచి కులమతాల మధ్య చిచ్చుపెట్టడమే బీజేపీ పని అని జిల్లా డీసీసీ అధ్యక్షు రాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జైబాపు, జైభీం, జైసవిధాన్ కార్యక్రమం లో భాగంగాచివరి రోజు హాజీపూర్ నుంచి గడ్‌పూర్ వరకు ర్యాలీ నిర్వ హించారు. రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కోఆర్డినేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

నస్పూర్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎంతో శ్రమ కూ ర్చి రాసిన రాజ్యాంగం వల్లనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు ప్రయో జనం చేకూరుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదంతో నస్పూర్‌లో 18,19, 20, 21 వార్డుల్లో శనివారం సాయంత్రం పాదయాత్ర నిర్వహించారు. సీసీసీ కార్నర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిం చారు. మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, మాజీ కౌన్సిలర్ కోడూరి లహరి విజయ్, వార్డుల ఇన్‌చార్జిలు సంపత్ రెడ్డి, ధర్ని మధుకర్, పట్టణ ఇన్‌చార్జి రమేష్, కోఆర్డినేటర్ అంకతి శ్రీనివాస్, పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలి

కోటపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నది స్నానానికి వెళ్లి ఇ సుక గుంతలో పడి మృతిచెందిన పూరెళ్ల అశోక్ కుటుంబానికి మైనింగ్ శా ఖ, ఇసుక క్వారీ కాంట్రాక్టర్ బాధ్యత వహిస్తూ రూ. 10 లక్షల నష్టపరి హా రం అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అశోక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఇసుక క్వారీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నే ప్రమాదం జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జ ర పడంతోనే యువకుడు మృతిచెందాడని అన్నారు. పార్టీ జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, మండల ఇన్‌చార్జి కాశెట్టి నాగేశ్వర్‌రావు, మండల అధ్యక్ష, ఉ పాధ్యక్షులు మంత్రి రామయ్య, పున్నంచంద్, నాయకులు పాల్గొన్నారు.

బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): చదువుకునే వయస్సులోనే విద్యార్థిని, విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఎంఈవో పోచ య్య అన్నారు. శనివారం బజార్ ఏరియా పాఠశాలలో ఘనంగా పాఠశాల వార్షి కోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిబాబు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ విజయ, ఉపాధ్యాయులు మహేశ్వర్‌రెడ్డి, లింగయ్య, వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

జన్నారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన కార్మికుల పెం డింగ్ బిల్లులను చెల్లించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ శనివారం ఎంఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడు తూ నాలుగు నెలలుగా ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన నిర్వహకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బిల్లులను చెల్లించాలన్నారు. అలాగే కోడిగుడ్లను, గ్యాస్‌ను ఉచితంగా అందిం చాలని, పీఎఫ్, ఈఎస్ సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు లక్ష్మణ్, బ చ్చన్న, లక్ష్మీ, లావణ్య, మంజుల, సువర్ణ, విజయ, లక్ష్మీ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నుంచి తప్పించుకోలేరు

బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాల ఏర్పాటు ద్వా రా దొంగతనాలు జరిగిన దాడులు, గొడవలు చేసిన కెమెరాల్లో పూర్తిగా రి కార్డు అవుతుందని దాని నుంచి ఎవరు తప్పించుకోలేరని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక ప్రాణహిత కాలనీలో కా లనీ వాసులతో సహకారంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటి సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కెమెరాలను ప్రారంభిం చారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్‌ఐ రాజశేఖర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో సింగరేణి అభివృద్ధి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వంలో సిం గరేణి సంస్థ ప్రగతి పథంలో దూసుకుపోతుందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు, క్రమ శిక్షణ కమిటీ చైర్మన్ కాంపెల్లి సమ్మ య్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య పేర్కొన్నారు. శనివారం విలేక రుల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్లలో సింగరేణి నుం చి నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. ఒరిస్సాలోని నైని బ్లాక్‌ను నిర్లక్ష్యం చేశారన్నారు. కానీ ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ నేతృత్వంలో నైని బ్లాక్ బొ గ్గు ప్రారంభానికి అడుగులు పడ్డాయన్నారు.

ధాన్యం కొనుగోళ్లు సమర్థవంతంగా నిర్వహించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దీపక్ కుమార్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : యాసంగి 2024-25 ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని, రైతులకు కొ నుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి సౌకర్యాలు క ల్పించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కు మా ర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రై తుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీస మద్దతు దరతో ధాన్యం కొను గోలు చేస్తుందని, సన్నబియ్యంకు కనీస మద్దతు ధరతో పాటు రూ. 500 అదనంగా బోనస్ అందిస్తుందన్నారు. కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాం టి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లా డుతూ 3,31,935 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచాన వేశామని తెలిపారు. జిల్లాలో 321 కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో భాగంగా ఇప్పటి 209 కేంద్రాల కొనుగోలు ప్రారంభించామని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరా ద్వారా పెట్రోలింగ్ పర్యవేక్షణ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరా ద్వారా నిర్వహిస్తున్న పెట్రోలింగ్‌ను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ శనివారం పర్యవేక్షించారు. కొత్తరోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై కె మెరాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఓపెన్ ఏరియా లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమకు సమాచారం ఉందని, అలాంటి చట్ట వ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు డ్రోన్ కెమె రాలను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్‌ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల డీఎస్పీ అధ్యక్షుడిగా రమేష్

మంచిర్యాల కలెక్టరేట్/గర్మిళ్ల ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎదునూరి రమేష్ నియమి తు లయ్యారు. ఈ మేరకు ఆయ నను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వి శారదన్ మహారాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌ను మంచిర్యాలలో నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్ర మం లో నాయకులు రామస్వామి, రాకేష్, రాజు, చంద్రశేఖర్, సదానందం, బా బురావు, జమీర్, రఫీ పాల్గొన్నారు.

విద్యార్థికి ఫీజు రీఫండ్

జన్నారం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జన్నారంలో ఓపెన్ స్కూల్‌లో చేరిన కవ్వాలకు చెందిన కొల్లూరి మహేష్ తాను చెల్లించిన ప్రవేశ రుసుము, పరీక్ష ఫీ జు రూ. 2వేలను తిరిగి విద్యార్థికి చెల్లించినట్లు ఎం ఈవో విజయ్‌కుమార్ శనివారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో చేపట్టిన బడి బయట పిల్లల సర్వేలో మహేష్‌ను గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించామ న్నారు. మహేష్ ఫీజు చెల్లించగా సర్వశిక్ష అభియాన్ ద్వారా తిరిగి ఫీజును రీఫండ్ చేశామన్నారు.

సభను విజయవంతం చేయాలి

చెన్నూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సబను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం చెన్నూరులో వా రు మాట్లాడుతూ సభకు బీఆర్ఎస్ నాయకులు, కా ర్యకర్తలు ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

మందమర్రిలో రన్‌ఫర్ జీసస్

మందమర్రిటౌన్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎస్‌ఐ చర్చి ఆధ్వ ర్యంలో సలోమ్ పాస్టర్ ఫెలోషిప్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రన్‌ఫర్‌జీసస్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు పాదర్లు మాట్లాడుతూ ఏసు క్రీస్తూ ప్రపంచ మాన వాళికి శిలువతో ప్రాణం విడిచి తిరిగి లేచాడని ప్రజలకు తెలియజేయడం కోసం రన్‌ఫర్ జీసస్ నిర్వహించామన్నారు. ఈకార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బంటు జెర్మియా ఏలి యా, ఆనంద్, జూపాక సల్మాన్, ఉన్నారు.

నస్పూర్: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండగ సందర్భంగా శనివారం నస్పూర్ పట్టణ కోల్‌బెల్ట్ పాస్టర్స్ ఫిలోషిప్ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ మీదుగా సువార్త శాంతి ర్యా లీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఫౌండర్స్ మెరుగు రత్న కుమార్, ఉబ్బని ఇమ్మనియేల్, ప్రసిడెంట్ క్యాతం అశోక్ పాల్, పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కోటపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్, కళాశాలలో శనివారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేసి, పాటలు పాడి అలరించారు. విద్యాశాఖ క్వాలిటీ కో ఆ ర్డినేటర్ సత్యనారాయణమూర్తి, ఎఎస్‌వో రాజ్‌కుమార్, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎం ఈవో వెంకటేశ్వర్లు, పాటశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

లక్షెట్టిపేట(హాజీపూర్), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని బీజేపీ జిల్లా అధ్య క్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. హాజీపూర్ మండ లంలోని పడ్తన్‌పల్లి, కర్ణమామిడి గ్రామాల్లో ఆయన బీజేపీ నా యకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల్లో రైతులు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలు సుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల కంట త డిపెట్టిస్తుందని 15 రోజుల నుంచి రైతులు కష్టపడి పండించి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం ఇప్పటి వరకు కొ నుగోలు చేయకపోడం ఏంటని ప్రశ్నించారు. ధాన్యం కొనుగో లు చేసే సమయంలో కటింగ్ చేస్తే ఊరుకునేది లేదని హెచ్చ రించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాత్ వెరబెల్లి, నాయకులు తమ్మినీడి శ్రీనివాస్, పెద్దపల్లి పురేషోత్తం, మాధవరపు వెంకటరమణరావు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొను గోలు కేంద్రాల వద్ద రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోళి మధు సుధన్‌రావు డిమాండ్ చేసారు. పట్టణ మున్సిపాలిటీలోని ఇటి క్యాలలో శనివారం బీజేపీ నాయకులతో కలిసి ధాన్యం కొనుగో లు కేంద్రాలను సందర్శించారు. ఈకార్యక్రమంలో కిసాన్ మో ర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్, జిల్లా అధ్యక్షుడు న



కర్ణమామిడిలో కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

గునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ఫార్మర్ స్కీం ఇంప్లిమేషన్ రాష్ట్ర కన్వీనర్ తమ్మినీడి శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణరావు, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండ నరేష్ పాల్గొన్నారు.

దండేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో అన్ని వర్గాల ప్రజలు, రైతులు కష్టాలు తప్పడం లేదని, హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్ అన్నారు. దండేపల్లి మండలం ముత్యంపేటలో ఐకేపి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లుగౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్, నాయకులతో కలిసి శనివారం సందర్శించారు.

పేదింటి వివాహానికి సాయం

కాసిపేట, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని గురువాపూర్‌లో శనివారం జరగ నున్న సిడం తిరుమల పెళ్లికి కాంగ్రెస్ నాయ కులు ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కు టుంబానికి చెందిన తిరుమల తల్లిదండ్రు ల కు ఆర్థికభారంగా మారింది. విషయం తెలు సుకున్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రత్న ప్రదీప్ ఆధ్వర్యంలో మట్టెలు, మంగళ సూత్రం బట్టలతో పాటు రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నా యకులు మైదం రమేశ్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

దండేపల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ పరిరక్షణ దేశ పౌరులం దరి బాధ్యత అని రాజీవ్‌గాంధీ పంచా య తీరాజ్ సంఘ టన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు అక్కల వెంకటేశ్వర్లు అన్నారు. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమా న్ని వెల్గనూర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేపట్టారు.